నేటి దినపత్రిక

# సూర్య

ఉత్తరాంధ్ర

www.suryaa.com

సోమవారం 2-9-2024 పేజీలు 4

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం

విజయనగరం శ్రీకాకుళం






## పసుపు కొమ్ములతో ప్రత్యేక అలంకరణలో నూకంబిక అమ్మవారు

అనకాపల్లి, సెప్టెంబర్ 1, మేజర్ న్యూస్

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం విశేష పర్వదినం నాలుగవ ఆదివారం సందర్భంగా బాలాలయంలో అమ్మవారికి పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పథకానికి పూర్వ వైభవం

**ఎత్తిపోతల పథకాలకు త్వరలోనే ఎన్నికలు : రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు**



శ్రీకాకుళం , సెప్టెంబర్ 1, మేజర్ న్యూస్

ఎత్తిపోతల పథకానికి పూర్వ వైభవం తెనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం చిన్నసాన ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు ఆదివారం పున :ప్రారంభించారు. 2200 ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకాన్ని 2018వ సంవత్సరంలో 25 కోట్లతో ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. దీనితో ఈ పథకంలో ఉన్న మోటార్లు ట్రాన్స్ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత జిల్లాలో సుమారు రూ.80 లక్షల ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేశారు. చిన్న సాన ఎత్తిపోతల పథకాన్ని ప్రస్తుతం వినియోగం తెచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మిగతా 2లో

## కాక రేపుతున్న సీఐల బదిలీలు

**జనసేన నేతల సిఫార్సుల్ని అంగీకరించని టీడీపీ ప్రజా ప్రతినిధులు -పెందుర్తిలో కుంపటి రాజేసిన ఇన్‌స్పెక్టర్ల స్థాన చలనం -గన్‌మెన్లను వెనక్కు పంపించేసి నిరసన వ్యక్తం చేసిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల**

విశాఖపట్నం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్

ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోలీస్ అధికారుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. ముఖ్యంగా జనసేన పార్టీ నేతల సిఫార్సుల్ని అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ఇప్పుడు కాక రేపుతోంది. 15రోజుల వ్యవధిలో ఆరు జిల్లాల పరిధిలో చేపట్టిన బదిలీల్లో అనేక వింతలు చోటు చేసుకోవడంతో పాటు నేతలు ఉత్తరాలిచ్చిన సీఐలకు అధికారులు ప్రాధాన్యత కల్పించకపోవడం విశేషం. దీంతో పెందుర్తి జనసేన పార్టీలో కుంపటి రాజుకుంది. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును సంప్రదించకుండా ఇన్స్‌పెక్టర్ల జాబితాను ప్రకటించడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తనకు ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్లను ఆదివారం ఉదయం ప్రభుత్వానికి సరెండర్ చేసి నిరసన వ్యక్తం చేశారు. రమేష్ బాబు సిఫార్సు చేసిన అధికారుల్ని కాదని వివిధ పోలీస్ స్టేషన్లకు వేరే వారిని నియమించడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా పరవాడ, సబ్బవరం స్టేషన్లకు తాను సిఫారుసు చేసిన వారికి కాకుండా ఎస్పీ, డీఐజీ, సీపీలకు కావాల్సిన వ్యక్తులకు ప్రాధాన్యతనిచ్చారంటూ ఆయన వర్గీయులు అగ్గిమీద బుగ్గిలమవుతున్నారు. దీని ద్వారా జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు టీడీపీ అధిష్టానం పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదని సీఐల బదిలీల ప్రక్రియతో రుజువైంది. అదే విధంగా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కూడా ఈ తంతుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలకు సంబంధం లేకుండా ఇన్‌స్పెక్టర్ల బదిలీలేంటంటూ అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో చాలా మంది కాపు సామాజిక వర్గానికి చెందిన ఇన్‌స్పెక్టర్లు ఉంటే వారిలో ఇద్దరికి మాత్రమే మైదాన ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చారంటూ ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కాపులకు ఓ మంత్రి పదవి ఇవ్వాలనే సాంప్రదాయం ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సాంప్రదాయాన్ని కూడా పక్కన పెట్టారని ఇప్పటికే కాపు వర్గానికి చెందిన నేతలు లోలోపల మదనపడుతున్నారు. ఇప్పుడు ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో బదిలీల్లో సైతం కాపు సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందంటున్నారు. వీరందరికీ కూటమి ప్రభుత్వం మొండి చెయ్యి చూపించడమే కాకుండా, కాపు సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేల సిఫార్సుల్ని కాదని వేరే వ్యక్తుల్ని నియమించడం ఇన్‌స్పెక్టర్ల బదిలీల ప్రక్రియతో తేటతెల్లమైందని కాపు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ల బదిలీలు ప్రక్రియపై ఏర్పడిన వివాదం ఇక్కడితో ముగుస్తుందా, భవిష్యత్తులో కూటమిలో మరింత కుంపటి రాజేసి ముదురు పాకాన పడుతుందా అన్నది చూడాలి.

## విశాఖ స్టీల్ సమస్యలపై చంద్రబాబు కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు?

**ప్రశ్నించిన ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌం -ప్రారంభమైన ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు -దివంగత నేతలకు నివాళులర్పించిన నాయకులు -మూడ్రోజుల పాటు సదస్సు, ఆఖరి రోజున విశాఖలో బహిరంగ సభ**



విశాఖపట్నం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్

విశాఖ స్టీల్‌కు సొంత గనులు కేటాయించాలని, విశాఖ ఉక్కును ప్రైవేటీ కరణ కాకుండా ఏపీ సీఎం చంద్రబాబు ఎందుకు కేంద్రాన్ని నిలదీయలేకపోతున్నారని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రశ్నించారు. ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు విశాఖలో ఆదివారం ప్రారంభమయ్యాయి. విశాఖ ఉక్కులోని గురజాడ కళాక్షేత్రం వేదికగా ప్రారంభమైన ఈ సమావేశాలు మంగళవారం ఆఖరి రోజున జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట బహిరంగ సభతో ముగుస్తాయని నేతలు తెలిపారు. సమితి అధ్యక్షులు రామేంద్ర కుమార్, డి. ఆదినారాయణ వంటి నేతలు హాజరై దివంగత నేతలు అతుల్ కుమార్ అంజన్, విజయ్ కుమార్ యాదవ్‌తో పాటు తాజాగా అచ్చుతాపురం ఫార్మాలో అశువులుబాసిన 19మంది కార్మికులు, ఇజ్రాయిల్‌లో మృతి చెందిన 30వేల మంది పాలస్తీనావారికి కూడా నివాళులర్పించారు. అనంతరం సంఘం జెండా ఎగురవేశారు. వీవీ రామారావు సభా హాల్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ 1290 రోజుల నుంచి కార్మికులు, ఉద్యోగులు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నా కేంద్రం ఎందుకు చలించడం లేదన్నారు. చంద్రబాబు, నితీష్‌పై ఆధారపడిన మోడీ ప్రభుత్వం.. మిగతా 2లో

## విద్యుత్తు పునరుద్ధరణ త్వరితగతిన పూర్తి చేస్తున్నాం

**ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి**



విశాఖపట్నం, సెప్టెంబర్ 1, మేజర్ న్యూస్

వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధనశాఖ కార్యదర్శి కె విజయానంద్ ఆదేశాలమేరకు ఎప్పటికప్పుడు అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ త్వరి తగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసు పత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, పవర్‌సాలు, స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామన్నారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 9 మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంత రాయం ఏర్పడగా యుద్ధప్రాతిపదికన సరిచేయటం జరిగిందన్నారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోల్ మిగతా 2లో

## సొసైటీలో పక్కదారి పడుతున్న ఎరువులు..!

**బ్లాక్‌లో అమ్ము కుంటే తప్పేంటి : ఎ.ఒ.శ్రావణి తేజ**
**-నాయకులకు ఇదంతా తెలిసే జరుగుతుంది : సిఈఓ**
**ఎ.ఒ కుమ్మక్కు, ప్రైవేటు వ్యక్తితో ఎరువుల పంపిణి**
**-కమీషన్ల కక్కుర్తితో పర్యవేక్షణకు ఎగనామం**
**-పర్యవేక్షణకు వెళ్లారా అని అడిగితే గుర్తు లేదన్న ఏ.ఓ..!**

మెరకముడిదాం సెప్టెంబర్ 1మేజర్‌న్యూస్

నారు పోసి, దుక్కి దున్ని పంట వేసి, కొత కోసి ఆరుగాలం కష్టపడి పండిస్తే గాని రైతన్నకు పెట్టుబడి కూడా రాని ఈ రోజుల్లో రైతన్న కు మెరకముడిదాం వ్యవసాయ అదికారులు కన్నీళ్లు పెట్టిస్తున్నారు. పంటకు సకాలంలో ఎరువులు దొరకక వరి పంట గిడస బారి పోయే పరిస్థితులు ఉన్న తరుణంలో వ్యవసాయ అధికారి శ్రావణీ తేజ రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కోపరెటివ్ సొసైటీ వారితోనూ, ఎరువులు పంపిణి డీలర్లుతోనూ, ఎ.ఒ లాలూచీ పడి రైతులు పొట్టపై కొడుతున్నారని విమర్శలూ ఉన్నాయి. కాసులకు కక్కుర్తి పడి రైతులకు అందవలసిన. మిగతా 2లో



## ఎటువంటి నష్టం జరగకూడదు

**జిల్లా కలెక్టర్ డా.బిఆర్ అంబేద్కర్**

విజయనగరం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్



వాయుగుండం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్‌డిఓల తో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల ప్రభావాన్ని తెలుసుకున్నారు. నదులు, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి మట్టంపై ఆరా తీశారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఆయా శాఖలు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలను సమీక్షించారు. జిల్లాలో ఆదివారం కొంత తెరిపి నిచ్చినప్పటికీ, ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. ఈ వర్షాల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. మండల నోడల్ అధికారులు మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. వైద్య శిబిరాలను కొనసాగించాలన్నారు. తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తరలించేందుకు పునరావాస కేంద్రాలను, ఆహార పదార్థాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లా స్థాయితోపాటు, డివిజన్, మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూములను ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక్కడ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండి, పరిస్థితిని పర్యవేక్షించాలని, అవసరమైన సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు. రెవెన్యూ, పంచాయితీరాజ్, నీటి పారుదల, వైద్యారోగ్యశాఖ, విద్యుత్, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య, ఉద్యాన, గృహనిర్మాణ శాఖల సన్నద్ధత పై ఆరా తీశారు. కాజ్‌వేలు, కల్వర్టులవద్ద కాపలా కొనసాగిం చాలని, వీటిపై నుంచి వరద నీరు పారే సమయంలో వాటిపై నుంచి ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చిన తరువాతే, రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచించారు.

## ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ప్రజల సేవార్థం తిరిగి అప్పగించిన తార సంస్థ

**సంస్థ పుస్తకాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

నర్సీపట్నం, సెప్టెంబర్ 1, మేజర్ న్యూస్



మాకవరపాలెంలో తారా సంస్థకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరిపారు. గత కొంతకాలంగా సంస్థ కార్యకలాపాలు జరగకపోవడంతో దశాబ్దాల క్రితం ప్రభుత్వం తమ సంస్థకు కేటాయించిన స్థలాన్ని, ప్రజాధనంతో నిర్మించిన భవనాన్ని ప్రజల అవసరాల కోసం వినియోగించేలా తిరిగి ప్రభుత్వానికి అప్పగించి తారా సంస్థ వ్యవస్థాపకుడు పి. మాథ్యూస్ ఆదర్శంగా నిలిచారు. శనివారం సాయంత్రం నర్సీపట్నంలో సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు మిగతా 2లో

**శాంతియుతంగా గణేష్ ఉత్సవాల నిర్వహణకు**

## కమిటీ సభ్యులు సహకరించాలి

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**



విజయనగరం క్రైమ్, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్

ఈ నెల 7న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసుకొనే గణేష్ పందిళ్ళు, మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుండి అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సెప్టెంబరు 1న కోరారు. వినాయక ఉత్సవాలను శాంతియుతంగా ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా నిర్వహించుకోవడానికి పోలీసుశాఖకు ప్రజలందరూ సహకరించాలన్నారు. వినాయక ఉత్సవాలు నిర్వహించబోయే వారు ముందుగా కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంతో https://ganeshutsav.net లాగిన్ అయి, నిర్ధేశించిన చలాన రుసుం చెల్లించి, అనుమతులు పొందాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతీ ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలని, ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందులు గురిచేయకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు, రికార్డింగు డాన్సులు నిర్వహించరాద న్నారు. ఉత్సవాలను బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించినట్లయితే సంబంధిత పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల నుండి అనుమతులు పొందాలని, అదే విధంగా ప్రైవేటు స్థలాల్లో నిర్వహిస్తే సంబంధిత స్థలయజమానుల నుండి ముందుగా అను మతులు పొందాలన్నారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో వాహనాల రాకపోక లకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఉత్సవాల్లో వినియోగించే మైకులు, సౌండు బాక్సులతో ప్రజలకు ఇబ్బందులు గురి చేయ కూడదని, నిర్దేశించిన సమయం, నిర్దేశించిన సౌండును మాత్రమే వినియోగిం చాలని, అందుకు సంబంధిత అధికారుల నుండి తప్పనిసరిగా అనుమతులు పొం దాలన్నారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో కమిటీ సభ్యులు 24/7లో అందు బాటులో ఉండాలని, సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మం డపాల్లో రాత్రి సమయాల్లో దీపారాధన వలన ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలన్నారు. నిమర్జనం నిర్వహించే సమయంలో ప్రమాదకరమైన రంగులు జల్లుకోవడం, ప్రేలుడు, బాణసంచా కాల్చడం నిషిద్ధమని, ఎటువంటి బాణాసంచాను వినియోగించకుండా చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేసారు. ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు, రికార్డింగు డాన్సులు నిర్వహించినా, ఊరేగింపుల్లో బాణాసంచా వినియోగించినా, బలవంతంగా వసూళ్ళుకు పాల్పడితే, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు.

## వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



శ్రీకాకుళం, సెప్టెంబర్ 1, మేజర్ న్యూస్

వాయుగుండం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు వలన, ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్‌డిఓలతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల ప్రభావాన్ని తెలుసుకున్నారు. నదులు, చెరువుల్లోని నీటి మట్టంపై ఆరా తీశారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఆయా శాఖలు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలను సమీక్షించారు. వర్షాలు జిల్లాలో ఆదివారం కొంత తెరిపి నిచ్చినప్పటికీ, ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. దీని కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. మండల నోడల్ అధికారులు మండలాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అవసరమైన చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లా మిగతా 2లో

## నేడు విద్యాలయాలకు సెలవు

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

విశాఖపట్నం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్

భారీ వర్షాలు, వరదలు నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సెప్టెంబర్ 2న అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ పాఠశాల, జూనియర్ కలశాల స్థాయి విద్యా సంస్థలను నిర్వహించడానికి వీలులేదని ప్రకటనలో స్పష్టం చేశారు. సంబంధిత జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.




## కార్పొరేటర్ రోహిణికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బోని

ఆరిలోవ, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్



జీవీఎంసీ , 12వ వార్డు కార్పొరేటర్ అక్క రమణి రోహిణి జన్మదినం సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బోని శ్రీనివాసరావు ఆమెకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోని ఆయురారోగ్యాలతో కలకాలం సంతోషంగా జీవించాలని ఆ దేవుని ప్రార్థించారు. బోనితోపాటు మరికొందరు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సన్మానం క్రీడాకారిణిగా మరింత బాధ్యత పెంచిందిలి

### అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి నాగజ్యోతి



నర్సీపట్నం, సెప్టెంబర్ 1,మేజర్‌న్యూస్

ఇప్పటికే క్రీడాకారిణిగా పలు సన్మానాలు అందుకున్నప్పటికీ, సొంత జిల్లాలో క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆశేష క్రీడాకారుల మధ్య సన్మానం అందుకోవడం క్రీడాకారిణిగా నాకు మరింత బాధ్యత పెంచిందని అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి పివిఎం నాగజ్యోతి అన్నారు. క్రీడా దినోత్సవం నాడు అనకాపల్లి ఒలింపిక్ అసోసియేషన్, నేషనల్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రైతు భారతి కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో అనకాపల్లి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు దాడి రత్నాకర్, నేషనల్ బాడీ బిల్డర్ శిలపర శెట్టి బాబి ఆధ్వర్యంలో సన్మానం అందుకోవడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే తాను అంతర్జాతీయ స్థాయిలో నాలుగు మెడల్స్ అందుకున్నానని, మరిన్ని మెడల్స్ సాధించడానికి పట్టుదలతో కృషి చేస్తున్నానన్నారు. అనకాపల్లి జిల్లాలో ఎంతోమంది జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించగల సత్తా ఉన్న క్రీడాకారులు ఉన్నారని, కానీ ఆర్థికంగా ప్రోత్సహించేవారు లేక వెనుకబడుతున్నారన్నారు. ఇప్పటికైనా క్రీడల పట్ల మక్కువ కలిగిన స్పాన్సర్స్ ముందుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

### ఇండో గ్లోబల్ యూనివర్సిటీ నుండి

## శ్రేష్ట చాణిక్య అవార్డును అందుకున్న టి.ఎన్.సి.ఆర్.సి.చైర్మన్ డా.సాయిరమేష్

సీతమ్మధార సెప్టెంబర్ 1,మేజర్‌న్యూస్




ముంబైలోని గ్రాండ్ కాన్వకేషన్ గ్యాలక్సీ, బ్యాంక్వెట్ వేదికగా ప్రముఖులు డాక్టర్ కేసరి లాల్ వర్మ, ఛత్రపతి శివాజీ మహారాజ్ యూనివర్సిటీ ముంబై వైస్ ఛాన్సలర్ సెభాస్టియన్ మైండ్స్, వైస్ ఛాన్స్ లర్ యూరో ఆసియన్ యూనివర్సిటీ, డాక్టర్ అశోక్ ఎం.ఎన్.నేషనల్ లా యూనివర్సిటీ ముంబై, డాక్టర్ రండిమాపత్తి రేజ్, అకాడమిక్ అడ్వైజర్ వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ, డాక్టర్ విజయ్ఎన్, డాక్టర్ సూర్య వంశీ ఐఏఎస్, డాక్టర్ రాజారామ్ మెహతో, మినిస్ట్రీస్ ఆఫ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వంటి ప్రముఖులు చేతులు మీదుగా శ్రేష్ట చాణిక్య అవార్డు అందుకున్నారు ఈ సందర్భంగా జీవితంలో అత్యంత గర్వించ తగిన క్షణంగా భావిస్తున్నానని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ గా వినియోగదారుల హక్కుల రక్షణ కోసం చేస్తున్న కృషికి ఈ అవార్డు రూపంలో గుర్తింపు రావడంపై నాపై ఉంచిన విశ్వాసానికి ప్రతీకగా నేను భావిస్తున్నాను ఈ అవార్డు స్వీ కరించడం ద్వార నా కృషికే మాత్రమే కాకుండ టిఎన్‌సిఆర్సీ సభ్యులు మొత్తానికే చెందుతుందని సీతమ్మధార లోని తన ప్రధాన కార్యాలయం నుంచి తెలియజేశారు.




## విచారణ పక్కదారి

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 1, మేజర్ న్యూస్

జాముగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ చేపట్టి వాస్తవాలు బయట పెట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి ఐటిడిఏ పిఓ అభిషేక్ విచారణ కమిటీని నియమిస్తామని ప్రకటించారు. ఈ కమిటీలు ఐటిడిఏ డిడి మండల ఏటిడబ్ల్యూ ఎంపీడీవో తాసిల్దార్ నలుగురితో కమిటీ ఏర్పాటు చేసి సమగ్రంగా విచారణ చేపడతామని శనివారం జాముగుడ బాలికల పాఠశాలలో సందర్శించి ప్రకటించారు. అయితే ఆశ్రమ పాఠశాలలను పర్యవేక్షించే అధికారులైన డిడి, ఏటిడబ్ల్యుఓ విచారణను సమగ్రంగా చేపట్టకుండా నీరుగర్చే అవకాశం ఉంటుందని విద్యార్థులు తల్లిదండ్రులు గిరిజన సంఘాల నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఆ పాఠశాలలో జరిగిన కొన్ని సంఘటనలపై సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకోకుండా సంబంధిత అధికారులు అనుకూలంగా వ్యవహరించినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కలుషిత ఆహారం తిని సుమారు వందమంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఈ సంఘటనపై కూడా నీరు గార్చే పరిస్థితి ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. అధికారులు ప్రకటించిన ఈ కమిటీపై పునరాలోచించి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కమిటీలో మార్పు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

## పంట పొలాలను కప్పేసిన ఇసుక

డుంబ్రిగుడ సెప్టెంబర్ 1 మెజర్ న్యూస్

ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు సాగుచేసిన పంట పొలాలను నీట ముంచుతుంది. రంగిలిసింగి పంచాయతీ ముసర్లంక గ్రామంలోని కొర్రగాసి అని గిరిజనుడికి చెందిన సుమారు ఎకరం వరి పంట పొలం పూర్తిగా ఇసుక మేటలు కప్పేసింది. ఎంతో కష్టపడి సాగుచేసిన వరి పంట పొలం నీట మునగడంతో నష్టపోయామని బాధిత గిరిజనుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంట పొలాలను స్థానిక గిరిజన సంఘం మండల నాయకుడు పి డొంబు, కే రాము, మోహన్ దాస్ సందర్శించి పరిశీలించారు. తక్షణమే నష్టపోయిన బాధ్యత గిరిజనుడికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## అధిక వర్షం కారణంగా సోమవారం పాఠశాలలకు సెలవు



నర్సీపట్నం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్

జిల్లాలో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండడంతో జిల్లా కలెక్టర్ సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు అనకాపల్లి జిల్లాలో అధిక వర్షపాతం నమోదు అవుతుండడంతో స్కూలు పిల్లలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముందు జాగ్రత్త చర్యగా కలెక్టర్ స్కూళ్లకు సెలవు ప్రకటించినట్లు ఎంఈఓ చీడిపల్లి తలుపులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు సెలవు దినముగా పాటించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సెలవు పాటించాలని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు స్కూల్స్ తెరిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తలుపులు తెలిపారు.

## ఆగమేఘాల్లో జాంగుడ పాఠశాలలో పిఓ ఆదేశాలతో ఆర్వో ప్లాంట్ మరమ్మత్తు : ఏటి డబ్ల్యూ మల్లికార్జున్

డుంబ్రిగుడ సెప్టెంబర్ 1 మేజర్ న్యూస్



మండలంలోని జాంగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మరమ్మతుకు గురైన ఆర్ఓ ప్లాంట్ ను ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు స్థానిక ఏటి డబ్ల్యూఓ మల్లికార్జున్ పర్యవేక్షణలో ఆదివారం మరమ్మత్తు పనులు హుటాహుటిన చేసి వినియోగంలో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏటి డబ్ల్యూ మల్లికార్జున మాట్లాడుతూ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ శనివారం జాము గూడ ఆశ్రమ పాఠశాలను సందర్శించి శుక్రవారం విద్యార్థులు తీసుకున్న కలుషిత ఆహారం జరిగిన సంఘటనపై అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన విషయం పాఠకులకు తెలిసిందేనన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఇచ్చిన మాట ప్రకారం అర్వో ప్లాంట్ మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం ఐటిడిఏ పిఓ చొరవతో వినియోగంలోకి తీసుకురడం జరిగిందన్నారు. అదేవిధంగా తాగునీటి అవసరాలకు, వంటలకు సురక్షితమైన నీటిని వినియోగించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఏటి డబ్ల్యూ ఆదేశించారు. ఆర్ ప్లాంట్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయురాలు సుజాతను ఆదేశించారు.

## సెప్టెంబర్ 8 వరకు అమేజాన్ ఫ్రెష్ సూపర్ వేల్యూ డేస్

విశాఖపట్నం, ఆగస్ట్ 31, ( మేజర్ న్యూస్)

సెప్టెంబర్ పండగ సీజన్ సందర్భంగా అమేజాన్ ఫ్రెష్ వారి సూపర్ వేల్యూ డేస్ శనివారం నుంచి ప్రారంభిస్తున్నారు. సెప్టెంబర్ 8 వరకు ఇది కొనసాగుతుంది. తాజా పండ్లు, కూరగాయలు, స్నాక్స్, పానియాలు, నిత్యావసరాలు వంటి విస్తృత శ్రేణి ఎంపిక ఉత్పత్తులలో కస్తమర్లు 45 శాతం వరకు తగ్గింపును ఆనందించవచ్చు. టాటా సంపన్, దావత్ రోజానా, పార్లే, ఫార్చ్యూన్ ఆయిల్ వంటి ప్రసిద్ధి చెందిన బ్రాండ్స్ నుండి ఎంచుకోవచ్చు, ఇంట ముంగిట నేరుగా ఉత్పత్తుల డెలివరీ పొందవచ్చు. గొప్ప డీల్స్ విలువైన ఆఫర్లతో అమేజాన్ ఫ్రెష్ క రిటర్నింగ్ కస్టమర్ అయినా లేదా కొత్త కస్టమర్ అయినా, భారీ ఆదాలతో ప్రతి ఒక్కరు రాబోయే పండగల సీజన్ ను సంబరం చేసుకోవచ్చు. ప్రైమ్ రిపీట్ కస్టమర్లు ఫ్లాట్ రూ. 300 క్యాష్ బాక్ ను పండ్లు మరియు కూరగాయలపై అదనంగా రూ. 50 క్యాష్ బాక్ ను, విస్తృత శ్రేణి ఉత్పత్తులపై 45 శాతం వరకు తగ్గింపును ఆనందించవచ్చు. కొత్త అమేజాన్ ఫ్రెష్ కస్టమర్లు మొత్తం రూ.400 క్యాష్ బాక్‌ను తమ మొదటి నాలుగు ఆర్డర్స్‌పై పొందవచ్చు, ఇది అమేజాన్ ఫ్రెష్‌తో షాపింగ్ సౌకర్యం, ఆదాలను అనుభవించడానికి పరిపూర్ణమైన సమయం చేస్తుంది.

## ఏఎల్ పురం హైస్కూల్లో జనసేన నాయకులు శ్రమదానం



గొలుగొండ. మేజర్ న్యూస్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏ ఎల్ పురం జిల్లా పరిషత్ హై స్కూల్లో క్లీన్ ఆంధ్ర క్లీన్ ఆంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు అనంతరం నర్సీపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ రాజన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సెప్టెంబర్ 2 పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని పై కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు అలాగే పవన్ కళ్యాణ్ అటవీ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రాష్ట్రంలో గ్రీన్ కవర్ 50% మేరకు ఉండేలా ప్రణాళికలు చేస్తామని ప్రకటించారన్నారు ఆయన ఆలోచనలకు అనుగుణంగానే శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు అలాగే గ్రీన్ ఆంధ్ర క్లీన్ ఆంధ్రాలో భాగంగా పరిసరాలు పరిశుభ్రతకు స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ జనసేన పార్టీ నాయకులు రేగుబళ్ళ సాంబమూర్తి (శివ) మండల అధ్యక్షులు గండం దొరబాబు సలాదుల ప్రసాదు దుంగల రమేష్ తదితరులు పాల్గొన్నారు

## గుండుపాలలో ఏపీ రైతు సంఘం డిమాండ్స్ దినోత్సవం



గొలుగొండ మేజర్ న్యూస్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ దినోత్సవం మండలంలో గుండు పాల గ్రామంలో నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మరియు బాబులు జెండా ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామనేడు మాట్లాడుతూ నేలతల్లిని నమ్ముకున్న రైతులకు పెట్టుబడి లేక అనేక కష్టాలు పడుతున్నారని అన్నారు పండించే పంట నుండి భూమి హక్కు పత్రాలు వరకు రాజకీయ ప్రభుత్వ అధికారుల దందాలతోటి అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతాంగం పై జాలి దయ తో ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రచారానికి ఆర్బికే లోరైతులకు ఉపయోగపడే స్టాకు ఎప్పుడు ఉండేది కాదన్నారు రీ సర్వే పేరుతో చదివేరాలతో రైతాంగాన్ని మోసం చేశారు అని పట్టా పాస్బుక్కులపై బొమ్మల పేరుతో గారడీలు చేసేరన్నారు రకరకాల పథకాలు పేర్లతో రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి ప్రజలను మోసం చేసేందుకు జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దించారన్నారు ఇటువంటి పరిస్థితి ని గమనించి గత ప్రభుత్వ పాలన దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వము మంచి ఆలోచనలు చేసి రైతులు పెట్టుబడులు పెట్టుకునే సమయంలో రైతాంగానికి తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి గిరిబాబు సింగంపల్లి రాజబాబు మర్రి రాములు నంబారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే మత్స్యకారుల భరోసా నిధులు విడుదల చేయాలి

నక్కపల్లి, సెప్టెంబరు 1, మేజర్ న్యూస్



మత్స్యకారులకు వేట నిషేధం సమయం ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు చెల్లించాల్సిన మత్స్యకారుల భరోసా వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అన్నారు. ఆదివారం రాజయ్యపేటలో జరిగిన సిపిఎం సమావేశం గ్రామ శాఖ కార్యదర్శి ఎం.మహేష్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న అప్పలరాజు,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకరరావులు ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక పరిస్థితిని, పేదరికాన్ని అర్థం చేసుకుని వెంటనే వేట నిషేధ పరిహారం ఇరవై వేల రూపాయలు చెల్లించాలని కూటమి ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గత వైయస్సార్ సిపి ప్రభుత్వం మత్స్యకారుల భరోసా సంవత్సరానికి పదివేల రూపాయలు ఇచ్చేదని ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కూటమి అధికారంలోకి వస్తే మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం ఇరవై వేల రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు కె.కాశీరావు, ఎం.భయ్యన్న, సిహెచ్ సోమేష్, బి.నూకరాజు, జీ.కాశీరావు, కె.భూలోక, పి.రమణ, బి.అప్పలరాజు, ఎం.జాన్, జీ.అంజి, సిహెచ్ తాతాజీ, పి.కాశీ, పి.కోటి తదితరులు పాల్గొన్నారు.

## గొలుగొండ గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కరించాలి

గొలుగొండ మేజర్ న్యూస్



మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ గురుకుల కళాశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు పాఠశాలలో శిథిలావస్థలో భవనాలు స్టోర్ రూములు కిచెన్ రూములు దర్శనమిస్తున్నాయని కొద్దిపాటి వర్షానికి పాఠశాల ప్రాంతమంతా జలమయమై పిల్లలు భోజనం చేయడానికి కూడా అనేక ఇబ్బందులు గురయ్యారు అన్నారు అదేవిధంగా బియ్యం పప్పులు ఇతర సామర్థ్యంతా కురుస్తున్న వర్షాలకు నీటి చమ్మతో అవి మెత్తగా తయారవుతున్నాయని అన్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వర స్పందించి గురుకుల కళాశాలపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు లేకుంటే గురుకుల పాఠశాల ఆవరణలో ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## బొడ్డపాలెంలో మెగా రక్తదాన శిబిరం

### హాజరైన భీమిలి జనసేన ఇన్చార్జ్ సందీప్



ఆనందపురం ,సెప్టెంబర్ 1 మేజర్ న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా ఆనందపురం మండలం వెల్లంకి గ్రామపంచాయతీ బోడ్డపాలెం గ్రామంలో మండల ఉపాధ్యక్షులు బాలు, సర్దార్ రెడ్డి ,ఆధ్వర్యంలో ఆదివారం 40 మందికిపైగా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా భీమిలీ జనసేన ఇంచార్జ్ సందీప్ హాజరైనారు మాట్లాడుతూ రక్తదానం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపి అనంతరం, ఇంచార్జ్, సందీప్ చేతుల మీదగా మేమెంటో సర్టిఫికెట్లు అందజేశారు ఈ కార్యక్రమంలో సాఖరి శీను బాబు, మండల పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, వైస్ ప్రెసిడెంట్ బాలు, మాస్టర్ రాజు, టి రమణ, గబ్బర్ సింగ్,అక్రమాని దివాకర్, రమేష్, వినోద్, ఎస్ రాంబాబు, రాజేష్, గంగరాజు, కళ్యాణ్, సాయి, శేఖర్, కేశవ ,తదితరు నాయకులు పాల్గొన్నారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన చేసిన గంకల కవిత అప్పారావు



అక్కయ్యపాలెం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్

గత మూడు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలు పట్ల గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ 48వ వార్డు పరిధిలో గల కొండ వాలు ప్రాంతం ఇందిరా నగర్ -5 ప్రాంతంలో అకాల వర్షం పట్ల ఓ ఇంటికి అనుకోని ఉన్న బేస్మెంట్ కుంగిపోయి,అకాల వర్షాలకు మెయిన్ డ్రైనేజీ కవర్ స్లాబ్ కుంగిపోయి పడిపోవడం జరిగింది.ఈ విషయ మై తెలుసుకున్న వెంటనే 48వ వార్డ్ కార్పొరేటర్, భారతీయ జనతా పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు జోరు వానను సైతం లెక్క చేయకుండా ఆదివారం నాడు హుట హుటిన సంఘటన స్థలానికి చేరుకొని వర్ష ప్రభావిత సంఘటనలను గమనించారు.ఈ సందర్భంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పై లోతట్టు ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం అధికమైందనీ వీటి వలన బేస్మెంట్,గోడ కూలిందని స్థానికులు సమాచారం మేరకు సంఘటన స్థలాని పర్యవేక్షణ చేశారు.ఈ సందర్భంగా వర్షాల వల్ల ఇబ్బందికర సంఘటనలను ఎదుర్కొంటున్నటువంటి ఇండ్లలో ఉన్న ప్రజలను చుట్టూ ప్రక్కల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని గంకల కవిత అప్పారావు అప్రమత్తం చేసారు.ఈ సందర్భంగా గంకల మాట్లాడుతూ 48వ వార్డు అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించడం జరుగుతుందని,వార్డు అభివృద్ధి కోసం జీవీఎంసీ కౌన్సిల్ లో వార్డు కార్పొరేటర్ గా పోరుబాట చేస్తూ వార్డు అభివృద్ధికి నిధులు తేవడం జరుగుతుందని, ఇందులో భాగంగా వార్డులో పలు చోట్ల రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేయడం జరిగిందని, తక్షణమే సంఘటన స్థలానికి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించామని ఈ సంఘటనలపై అధికారులతో చర్చించి తక్షణమే పర్యటన చేసి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తతో వ్యవహరించేలా చూడాలని అధికారులను కోరారు.వర్షం ముప్పు తగ్గగానే యుద్ధ ప్రాతిపదికన గోడ నిర్మాణం ఏర్పాటు చేస్తామని గంకల కవిత అప్పారావు హామీ ఇచ్చారు.జోరు వానను సైతం లెక్క చేయకుండా హుట హుటిన సంఘటన స్థలానికి చేరుకొని, అధికారులతో సంప్రదించి, కొంతమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినటువంటి గంకల కవిత అప్పారావు వార్డ్ కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు కృషి పట్ల ఇందిరా నగర్ -5 గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## వాసవీ క్లబ్ వనిత విజయం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్, సెప్టెంబర్ 1, మేజర్ న్యూస్



వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కల్వ కుంట్ల చంద్రశేఖర్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా వాసవీ క్లబ్ వనిత విజయం వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్.వి.ఎన్. బ్లడ్ బ్యాంక్ నందు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ ఆత్మకూరి సాంబ మూర్తి హాజరయ్యారు. జిల్లాలో రక్తనిల్వలు పెంపొందించుటకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎటువంటి అపోహలను నమ్మవద్దని రక్తదానం చేయుటవలన ఏ సమస్యలు రావని అన్నారు.ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనిత విజయం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి,కార్యదర్శి కాపుగంటి రాధిక,కోశాధికారి గుంపిన దేవి విద్యాలక్ష్మి,ఇందిరా,నారాయణరావు,చెన్నా బుచ్చి జనార్ధనరావు, రత్నారావు, విజ్జపు విజయకుమార్, సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. రక్తదానం లో పాల్గొన్న దాతలకు పండ్లు అందజేశారు.



## 9వ వార్డులో పింఛన్లు అందజేసిన ఒమ్మిరాజు

ఆరిలోవ, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు నేతృత్వంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 1వ తారీకు సెలవు దినం వలన శనివారం 31 ఉదయం 6 గం గంటల నుండి సంజయ్ గాంధీ కాలనీ, ప్రశాంతి నగర్ ప్రాంతంలో సచివాలయం సిబ్బందితో డోర్ టు డోర్ వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు నాయకులు పాల్గొన్నారు.

### వర్షాల వల్ల ఇబ్బందులు కలుగకుండా

## ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం

### నగరపాలక సంస్థ : కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం టౌన్, సెప్టెంబరు 1, మేజర్ న్యూస్



వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. ఈ మేరకు ఈరోజు నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను గమనించారు. లోతట్టు ప్రాంతాలకు చేరుకుని అక్కడ నెలకొన్న పరిస్థితులను అంచనా వేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరనప్పటికీ ముందస్తు జాగ్రత్తగా వర్షపు నీరు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఆ తర్వాత కుసుమగజపతి మార్గ్ ప్రాంతంలో కాలువలు సరిచేయాలని సూచించారు. రింగ్ రోడ్డులో నగరపాలక సంస్థకు చెందిన భవనాన్ని సచివాలయంగా మార్చాలని ఆదేశించారు. సింగపూర్ సిటీ కి వెళ్లే మార్గంలో కోమటి చెరువు వద్ద పాక్షిక మరమ్మతులు చేపట్టి రహదారిని సరిచేయాలని చెప్పారు. గంట స్తంభం ప్రాంతానికి చేరుకుని మార్కెట్ ఏరియాలో పర్యటించారు. రోడ్లపై చెత్తలు వేయకుండా వ్యాపారస్తులలో అవగాహన కల్పించాలని పారిశుధ్య పర్యవేక్షకులకు ఆదేశించారు. అప్పటికి పరిస్థితిలో మార్పు రాకుంటే అపరాధ రుసుములు విధించాలని చెప్పారు. అలాగే రహదారులపై నీరు నిలవ లేకుండా చూడాలని సూచించారు. నగరంలో గుంతలను తక్షణమే పూడ్చాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు అప్రమత్తం అయ్యామన్నారు. ఇందుకోసం సిబ్బందితో నిరంతర పర్యవేక్షణకై సిద్ధం చేసామన్నారు. అలాగే మూడు రోజులపాటు మూడు టీములను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఆయా ప్రాంతాల పారిశుధ్య పర్యవేక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంతటా అప్రమత్తం

### క్షేత్ర స్థాయిలో ముందు జాగ్రత్త చర్యలు -పలు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు

విజయనగరం, సెప్టెంబర్ 1, మేజర్ న్యూస్

భారీ వర్షాలు కారణంగా జిల్లాలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా అధికార యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ సూచనలకు అనుగుణంగా అధికారులు క్షేత్ర స్థాయికి తరలి వెళ్లారు. మండల నోడల్ అధికారులంతా శనివారం నుంచి మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. త్రాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకున్నారు. సురక్షిత నీరు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వ్యాధులపై సర్వే ప్రారంభించారు. తీరప్రాంతాల్లో అధికారులు నిరంతరం సముద్ర తీరాన్ని, అలల తీవ్రతను పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి సమాచారం అందజేస్తున్నారు. వర్షాలు దృష్టిలో పెట్టుకొని వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. హుటాహుటిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. కాలువలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయిస్తున్నారు. వ్యాధుల నివారణ పట్ల గ్రామాల్లో ప్రజలకు చైతన్యం కలిగిస్తున్నారు. గెడ్డలు, వాగులు, నదులు పొంగి ప్రవహిస్తుండటంతో, ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు. చెరువులు వద్ద గండ్లు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. కాజ్ వే, వంతెనల వద్ద కాపలా పెట్టారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు పని చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అవసరమైన ఆదేశాలను జారీ చేస్తున్నారు.

## నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

విజయనగరం, సెప్టెంబర్ 01, మేజర్‌న్యూస్

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం నేడు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రకటనలో తెలిపారు.

## బి.జె.పి. భీమిలి నియోజకవర్గ నాయకులతో అవగాహన సదస్సు

భీమునిపట్నం, సెప్టెంబర్ 01, మేజర్ న్యూస్



భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుకు సంబందించి భీమిలి నియోజకవర్గం నాయకులతో స్థానిక శ్రీనివాస పంక్షన్ హాలులో అవగాహన సదస్సు జరిగింది. భీమిలి నీయోజకవర్గం కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సుకు రాష్ట కార్యదర్శి, ఉత్తరాంధ్ర సభ్యత్వ నమోదు ప్రముఖ్ కేతినేని సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి నియోజకవర్గం నాయకులకు సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మత్స్యకార సెల్ జిల్లా కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు పట్నాయిక్, జిల్లా కార్యదర్శి బండారు అనిల్ కుమార్, ఆర్గానిక్ సెల్ కన్వీనర్ చిరికి సత్యనారాయణ, మండల అధ్యక్షులు అన్నదేవర సురేంద్రకుమార్, బత్తిన రమణ, గంధసిరి రాజన్న, కాళ్ళ కాసులు, డివిజన్ అధ్యక్షులు కంటుభుక్త సునీత, ఊళ్ళ కొండబాబు, అయినాడ మాధవ్, డిఆర్కే రాజు, చోడవరపు నాగరాజు, నాయకులు ఎంవి రాఘవ రావు, పోలుబోతు విజయ, కురిమెళ్ళ కవిత, గుజ్జు రాము, గరికిన ఎల్లాజి, హంస మహేష్, సిరికి మోహన్, తమ్మిన ఉమాదేవి, కనకల అప్పలం నాయుడు, సరగడ సంజీవ రెడ్డి, పిల్లా చిన్నారావు, కుంది పరిమిళ, సురాడ ఎల్లారావు, బాయి సతీష్, సుబ్బరాజు తదితరులు పాల్గోన్నారు.

# కొత్తవలసలో మెగా వైద్య శిబిరం

**ఆమదాలవలస రూరల్ ,సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**



ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన ధరణి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరాలజీ వైద్యురాలు డాక్టర్ గురుగుబెల్లి యమునారాణి, గ్యాస్ట్రోఎంటలజీ వైద్యులు దానేటి ధరణిష్ బాబు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. నరాల వ్యాధిగ్రస్తులు, గ్యాస్ట్రిక్, ఇతర వ్యాధిగ్రస్తులకు 250 మందికి వైద్య పరీక్షల నిర్వహించినట్లు తెలిపారు. బిపి, షుగర్ పరీక్ష నిర్వహించి మందు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాలని సంకల్పంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు డాక్టర్ ధరణిష్ బాబు తెలిపారు. ప్రతినెల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ఉచితంగా పరీక్ష నిర్వహించి మందులు అందించి ప్రజలకు సేవలందించినట్టు ఆయన తెలిపారు. తన తండ్రి దంత వైద్యులు దానేటి రమేష్ బాబు కూడా దూసిపేట గ్రామానికి చెందిన వారిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వన సంరక్షణ... మనందరి బాధ్యత

## స్థానిక గ్రంథాలయం దగ్గర మొక్కల పెంపకం

**తెర్లాం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్:**



వన సంరక్షణ...మన అందరి బాధ్యతని ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని చేపట్టాలని స్థానిక గ్రంథాలయ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం చదవడం మాకిష్టం అన్న కార్యక్రమాన్ని పురస్కరించుకొని వివిధ రకాల పండ్ల పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచడం వలన పచ్చదనం కాలుష్య నివారణ వాటితో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి పనికి వచ్చే విధంగా చెట్లు పెంచడం వలన ప్రయోజనమని కలుగుతుందన్నారు .అందుకు ప్రతి ఇంట ప్రతి గ్రామం సరిహద్దుల్లో మొక్కల పెంపకం చేపట్టాలని వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పిల్లలకు పాఠకులకు పచ్చదనం పరి శుభ్రత అన్న స్లోగన్ పై వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేశారు అనంతరం విజేతలకు బహుమతులు అందించారు కార్యక్రమంలో ఆయనతోపాటు పాఠకులు పిల్లలు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లేడు ద్రావణం తయారీ పై రైతులకు అవగాహన

**బాడంగి, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**



మండలంలోని ముగడ గ్రామంలో ఎంఏఓ శిరీష ఆదేశాల మేరకు ఆదివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏం సన్యాసమ్మ శ్రీను రైతులతో జిల్లెడు ద్రావణం తయారు చేసి రైతులకు అవగాహన కల్పించారు 200 లీటర్ల నీరు 20 కేజీలు జిల్లేడు ఆకుముక్కలు చేసి పది లీటర్ల ఆవు మూత్రం. డ్రమ్ములో మూడు రోజులు మురగ వేయాలి ఉదయము సాయంత్రము నవ్వ దిశలో కలపడం ద్వారా జిల్లెడు ద్రావణం తయారవుతుందని ఆయన అన్నారు ఒక ఎకరం పొలం లో 10 లీటర్ల జిల్లెడు ద్రావణము 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు దీని వలన వరిలో వచ్చే పొటాష్ లోపాన్ని నివారించుటకు ఉపయోగపడుతుందని సూక్ష్మ పోషకాలు లోపాలు నివారణకు మరియు రసము పీల్చే పురుగులు నివారణకు ఉపయోగపడుతుందని దీనిని ఏడు రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఐ సి ఆర్ పి ఎస్ టి కుమారి. అన్నపూర్ణ రైతులు పాల్గొన్నారు.

## కోనో వీడర్ తో శ్రీవరి సాగులో అధిక లాభాలు



**ఆమదాలవలస రూరల్, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్:**

వరి వ్యవసాయ సాగులో కోనో వీడర్ తో రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్చార్జి నక్క చిరంజీవి అన్నారు. ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ గ్రామంలో కొనోవేడర్ పై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. దీనివలన వరి పంట సాగులో కలుపు నివారణకు, నేలలో వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది అధిక పిలకలు పెరిగేందుకు ఉపయోగ పడుతుందని తెలిపారు. కోనో వీడర్ చేయడం వల్ల కూలీలు సంఖ్య తగ్గించవచ్చునని చెప్పారు. రైతులు శ్రీ వరి పద్ధతిలో సాగు చేస్తే ఈ కోనో వీడర్ తో మంచి ఫలితాలు ఆశించగలమని తెలిపారు. రైతులంతా ఆధునిక పద్ధతి లో సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అవలంబిస్తే ఆరోగ్యవంతమైన పంటలు ఉత్పత్తులను పొంద గలమని తెలిపారు. మానవుడు ఆరోగ్యవంతంగా జీవించాలంటే రసాయనిక వాడకాలు తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు పయనించాలని తెలిపారు.

# తగ్గిన చికెన్ ధరలు

**ఆమదాలవలస, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్:**



జిల్లాలో చికెన్ ధరలు అమాంతం తగ్గడంతో ఆమదాలవలసలో కూడా తగ్గుదల కనిపించింది. ప్రస్తుత సీజన్ వర్షాకాలం కావడం, శ్రావణమాసం ఉండడంతో చికెన్ అమ్మకాలు భారీగా తగ్గాయి. దీనివలన వీటి ధరలు పడిపోయినట్లు హెూల్ సేల్ వ్యాపారులు చెబుతున్నారు. బ్రాయిలర్ లైవ్ దగ్గర 115 రూపాయలు, డ్రెస్ డ్ చికెన్ 185 రూపాయలు, స్కిన్లెస్ చికెన్ 200 రూపాయలు ప్రస్తుతం ధరలు ఉన్నట్లు వెల్లడించారు. గతంలో కేజీ చికెన్ 230 రూపాయలు ఉండేదని, ప్రస్తుతం ధరలు బాగా తగ్గడంతో చికెన్ ప్రియులకు కాస్త ఊరట లభించింది. చికెన్ ధరలు తగ్గిన తగినంత వ్యాపారాలు లేవని చికెన్ వ్యాపారాలు చెబుతున్నారు. మరి కొన్ని రోజుల్లో చికెన్ ధరలు భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నట్లు వెల్లడించారు.

## భారీ వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**బాడంగి, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**



రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నదని తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ఆదివారంబాడంగి మండల వ్యవసాయధికారి కే. శిరీష క్షేత్ర పరిశీలన చేసి రైతులుకి పలు సూచనలు సలహాలు ఇచ్చారువర్షపు నీరు పంట పొలం లో నిలబడకుండా బయటకి పోయే మార్గాలు చేయాలనీ రైతులకుకోరారు పంట ముంపు కి గురైనట్లయితే వెంటనే నీరు తొలగించి ఎకరానికి 30కిలోలు యూరియా, 15కిలోలు పొటాష్ వేసుకోవాలని తెలిపారుమెట్టు పంటలైన మొక్కజొన్న, ప్రత్తి, కూరగాయలు పంటలో వర్షపు నీరు బయట కి పోయేలా కాలువలు ఏర్పాటు చేసి వర్షానానంతరం 19-19-19 లీటర్ నీటికి 5గ్రాములు చొప్పున కలిపి పంట పై పిచికారీ చేయాలన్నారు వాతావరణ ప్రతికుల పరిస్థితి లు కారణంగా వరి పంటలో పాము పొడ తెగుళ్ల వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉన్నందున వర్షానంతరం హెక్సకొనజోల్ మందు ని లీటర్ నీటికి 2 ఎం ఎల్ చొప్పున చేను మొత్తం బాగా తడిచేలా పిచికారీ చేయాలనీ సూచించారు.

# ఒకటి నుండి ఐదు తరగతులు ఎరుకుల పాకలు పాఠశాలలోనే నిర్వహించాలి




**బాడంగి, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్:**

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ మధుర గ్రామమైనఎరుకులపాకలు గ్రామం లో ఉన్న ఎంపీపీ స్కూల్ మెర్జింగ్ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు బొబ్బిలి నియోజకవర్గంఎమ్మెల్యే బేబీ నాయన కు వినతి పత్రం అందించి న్యాయం చేయమని కోరినట్లు టిడిపి పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ పాలవలస గౌరు అన్నారు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరుకులపాకలు గ్రామ ప్రభుత్వపాఠశాల సమస్యపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే తో సహా ఉన్నతఅధికారులు వెంటనే స్పందించి ఎంపీపీ స్కూల్ లోని 3,4,5తరగతుల విద్యార్థులను గజరాయిని వలస ఎంపియుపి స్కూల్ కి పంపించే విషయంపైనా పూర్తిస్థాయిలో విచారణ చేసి వాస్తవాలను వెంటనే తెలియపరచాలనిబాడంగి మండలం ప్రస్తుతం విద్యాశాఖధికారులు (1%ఊ%2)లకు ఏరుకులపాకల గ్రామం ఎంపీపీ స్కూల్ కి వెళ్లి గతంలో అసలేం జరిగింది గతంలో ఎలాంటి రిపోర్ట్ ఇచ్చారు తదితర విషయాలపై లోకల్ ఎంపీటీసీతో మాట్లాడి సమస్యను పరిష్కార దిశగా సంప్రదింపు జరిగే విధంగా తగిన సమాచారం అందించవలసిందిగా గౌరవ కలెక్టర్ గారు మరియు డీఈవో గారు సంబంధిత మండల విద్యాధికారులను ఆదేశించగా మండల విద్యాధికారులు ఒకటి, రెండు మా ఎంపీపీ స్కూల్ కి వచ్చి నాతో మాట్లాడి గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీవోకి విరుద్ధంగా ఎస్టీ విద్యార్థులు చదువు నేర్చుకున్నటువంటి ఒకే ఒక్క గిరిజన స్కూలు అని కూడా ఆలోచించకుండా రాజకీయ కక్షతో ఎలాగైతే పై అధికారులకు గతంలో తప్పుడు రిపోర్ట్ ఇచ్చారో అదే విధంగా ప్రస్తుతం ఉన్న మండల విద్యాధికారులు కూడా అప్పటి వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగానే ఉన్నట్టు ప్రస్తుతము కూడా జీవో కి విరుద్ధంగా తప్పుడు రిపోర్టు సమర్పించడం జరిగిందని వాస్తవానికి ఈ రెండు స్కూల్లో మధ్య దూరం సుమారుగా 1.5 కిలోమీటర్లు ఉంటుంది కానీ ప్రస్తుత మండల విద్యాధికారులు ఒక కిలోమీటరు దూరం కంటే తక్కువ ఉందని రిపోర్ట్ సమర్పించడం జరిగింది. కిలోమీటర్ దాటి ఉంటుందని మేము చెపుతున్నా మా మాటలు పట్టించుకోకుండా వాళ్లకి నచ్చినట్టు రిపోర్టర్ రాసుకుని వెళ్లడం జరిగింది కావున తక్షణమే సంబంధిత అధికారులుస్పందించి ఈ విషయంపై మాకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు లేని యెడల బాడంగి ఎం ఈ ఓ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు

# సిపిఐ దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయండి

## సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పిలుపు

**నరసన్నపేట, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్:**

నిత్యవసర వస్తువుల ధరలపై రేపటి నుంచి 6వ తేదీ వరకు జరిగే ప్రచార, నిరసన కార్యక్రమాలను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. శ్రీకాకుళంలో స్థానిక ఎన్ ఆర్ క్రాంతిభవన్ లో నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు చుక్కల నుంటుతున్నాయని, కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయని అన్నారు. పేద,సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని, దీనికి తోడుగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనేకసార్లు పెంచి సామాన్య ప్రజలను నడ్డి విరిచే విధంగా ప్రభుత్వాలు పాలిస్తున్నాయని అన్నారు. ఒకవైపు కొత్త రేషన్ కార్డులు మంజూరుకు జనాభా లెక్కల తో ముడిపెడుతూ, మరోపక్క కార్డుదారులు మరోసారి ఆధారాలు చూపి రేషన్ కార్డులు పునరుద్ధించుకోవాలని నిబంధనలు పెడుతూ రేషన్ కార్డులు కుదించే యోచనలో ప్రభుత్వాలు ఉన్నాయని మండిపడ్డారు. జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్న అధిక ధరలను అరికట్టి, పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆరవ తేదీ వరకు ప్రచార,నిరసన కార్యక్రమాలు జరుగుతాయని అని తెలిపారు.




**డిమాండ్స్...**

పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించాలి. -ధరల స్థిరీకరణకు బడ్జెట్లో తగు నిధులు కేటాయించి,సక్రమంగా వినియోగించాలి. -అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి. -ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి, కేరళ తరహాలో నిత్యవసర వస్తువులను సబ్సిడీ రేట్లకే చౌక డిపోల ద్వారా అందించాలి. -ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలి. -పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలి. -రేషన్ కార్డుదారులకు ఈకేవైసి ప్రక్రియ సులభతరం చేయాలి. -జనాభా గణన నిర్వహించాలి. పై డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొజ్జాడా యుగంధర్, కొన్న శ్రీనివాసరావు సిపిఐ నాయకులు K.వసంతరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానంను వెంటనే పునరుద్ధరించాలి

## ఎమ్మెల్యే రమణమూర్తికి ఎ.పి.సి.పీ.ఎస్.ఈ.ఏ వినతి



**నరసన్నపేట, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఎ.పి.సి.పీ.ఎస్.ఈ.ఏ నాయకులు రెడ్డి సూరిబాబు,తలగాన చంద్రశేఖర్, బాదాన రాజు, యు.శ్రీనివాసరావు లు సీపీఎస్ విధానం ను రద్దు చేసి పాత పెన్సన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ నరసన్నపేట శాసన సభ్యులు బగ్గ రమణ మూర్తి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎ.పి.సి.పీ.ఎస్.ఈ.ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి తలగాన చంద్రశేఖర్ లు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పాలిట శాపంగా పరిణమించిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కు సహకరించాలని కోరారు. సీపీఎస్ విధానం రద్దు చేస్తామని ఇచ్చిన హామీని గత ప్రభుత్వం తప్పిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి బాదాన రాజు, జిల్లా కౌన్సిలర్ యు. శ్రీనివాసరావు లు సీపీఎస్ విధానం వలన కలిగే అనర్థాలను గౌరవ శాసన సభ్యుని దృష్టికి తీసుకువెళ్లారు. పాత పెన్షన్ పునరుద్ధరణ తప్ప మరే ఇతర ప్రత్యామ్నాయం ను అంగీకరించే స్థితిలో ఉద్యోగులు లేరని వారు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పాత పెన్షన్ పునరుద్ధరణ కొరకు ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని వారు ఆయనను కోరారు. గౌరవ శాసన సభ్యులు బగ్గ రమణ మూర్తి సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పాత పెన్షన్ పునరుద్ధరణ కు తన వంతు ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.సి.పీ.ఎస్.ఈ.ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి తలగాన చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి బాదాన రాజు, జిల్లా కౌన్సిలర్ యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# తుఫాన్ నేపథ్యంలో ప్రజల అప్రమత్తం కావాలి

## కొత్తవలస బిబగ్గం దొర వలస మధ్య రాకపోకల ఆపండి

## అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్

**పార్వతీపురం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్:**

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్తవలస డ్యామ్ వద్ద నీటి ప్రవాహము ఉధృతంగా ప్రవహిస్తున్నందున గ్రామస్తుల రాకపోకలను నిలుపుదల చేసి ముందస్తు అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మక్కువ మండలం కొత్తవలస బగ్గం దొర వలస గ్రామాల మధ్య ప్రజలు రాకపోకలను నిలువరించాలని మండల తాసిల్దార్ జ రాములమ్మ ను ఆదేశించారు. ఆదివారం ఉదయం జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ను ఆయన ఆర్డిఓ కే హేమలత కలిసి పరిశీలించారు. పుట్టూరు కాజ్ వే, సీతానగరం మండలం కొత్తవలస డ్యామ్ వద్ద వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.రాకపోకలు జరగకుండా డ్యామ్ కు వెళ్ళే మార్గంలో తవ్విన ట్రెంచ్ ను చూసారు. పశువులు, జాలరులు, ప్రజలు అటువైపు వెళ్లకుండా డ్యామ్ కు ఇరువైపులా రెవిన్యూ సిబ్బందిని నియమించి అప్రమత్తం చేయాలని సూచించారు. డ్యామ్ వద్ద ప్రస్తుత ప్రమాదకర పరిస్థితిని అక్కడ ప్రజలకు కలెక్టర్ తెలియజేసారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రజలు సహకరించాలని కోరారు. చెత్త నుండి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పంచాయితీ కార్యదర్శి కె.గౌతమి ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కొత్తవలస డ్యామ్ సమీపంలోని చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త నుండి సంపద కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు ఉండడం, నిర్వహణ లోపానికి గల కారణాలు పై ప్రశ్నించి



అసహనాన్ని వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 15 తేదీ నుంచి చెత్త నుండి సంపద కేంద్రాన్ని వినియోగంలో తీసుకురావాల్సిందేనని అన్నారు. పుట్టూరు కాజ్ వే ను పరిశీలన మండలంలోని పుట్టూరు కాజ్ వే ను కలెక్టర్ పరిశీలన చేసారు. రోడ్డుపై వరద నీరు ప్రవాహానికి గల కారణాలను రైతులను అడిగితెలుసుకున్నారు.కాజ్‌వే ఎత్తు తక్కువగా ఉండటం వలన భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుండి నేలకొరిగిన చెట్ల కలప వస్తుండడంతో మూసుకుపోతుందని రైతులు తెలిపారు. దీని కారణ ంగా నీటి ప్రవాహం సాఫీగా జరుగక రోడ్డుతోపాటు పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.హేమ లత, ఉప తాసిల్దార్ ఏ. ఉమామహేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీనుబాబు, కొత్తవలస, బగ్గం దొర వలస వీఆర్వోలు కె. శ్రీదేవి, ఎస్.సునీల్, తదితరులు, పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్స్ డే సందర్భంగా జెండా ఆవిష్కరణ

**పాలకొండ, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**



మండలం కొండాపురం గ్రామంలో గ్రామ అధ్యక్షులు బలగ దుర్గారావు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11వ తేదీన అఖిల భారత కిసాన్ సభ ప్రారంభ మహాసభ జరుపుకొనగా సెప్టెంబర్ 1వ తేదీన ఆనాటి బ్రిటిష్ వారి రైతు వ్యతిరేక విధానాలకు మరియు రైతు హక్కుల కోసం పెద్ద ఎత్తున నినాదం చేయడం జరిగింది. జమీందారీ విధానం రద్దు చేయాలని, అధిక పన్నులను నిలిపివేయాలని తదితర డిమాండ్స్ ను రూపొందించుకొని డిమాండ్స్ దే గా పిలుపునివ్వడం జరిగింది. ఆనాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా సంఘమున అన్ని గ్రామాల్లో జండాను ఆవిష్కరణ చేసి కోర్కెల దినాన్ని జరుపుకోవడం జరుగుతుంది అని అప్పలనాయుడు గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలో కూడా కార్పొరేటర్ రంగాన్ని ప్రోత్సహిస్తూ వ్యవసాయ రంగంలో అడ్డంకుగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ రైతు వ్యతిరేక 3 నల్ల చట్టాలను నరేంద్ర మోడీ తీసుకురాగా, వాటిని వ్యతిరేకిస్తూ లక్షలాదిమంది రైతులు 13 నెలల కాలం పాటు ఢిల్లీ నడిబొడ్డున ఉద్యమాలు చేయగా, ఉద్యమాలను హేళన చేసిన నరేంద్ర మోడీ చివరకు తలవగ్గి చర్చలలో భాగంగా చట్టాలు రద్దు చేస్తానని,పంటల మద్దతు ధరల చట్టాన్ని చట్టబద్ధత కల్పిస్తానని, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ సిఫార్సులను అమలు చేస్తానని మాట ఇచ్చారు. కరోనా కష్టకాలంలో కూడా పరిశ్రమలన్నీ మూతపడగా కార్మికులు, వలస కార్మికులకు గ్రామీణ ప్రాంతంలో ఉన్న వ్యవసాయం పనులు కల్పిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరచడంలో వ్యవసాయ రంగం పాత్ర మర్చిపోలేని గాని ఆయన గుర్తు చేశారు. ఆనాటి ఉద్యమ సందర్భంగా చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని చెప్పారు. రైతులపై ఉన్న కేసులు ఎత్తివేస్తామని ప్రకటించారు కానీ ఈనాటికీ ఏ ఒక్కటి అమలు చేయకపోవడం దురదృష్టం. మొన్న ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి తరపున గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు వ్యవసాయం చేయడం కష్టంగా ఉందని, రైతును ఆదుకోవటానికి సాగు సాయం 20 వేల రూపాయలు చేస్తానని మాట ఇచ్చారు. నేటికీ గద్దెనెక్కి మూడు నెలలు కావస్తున్నా, రైతుకు ఇదే సరైన వ్యవసాయ పెట్టుబడి సమయమని తెలిసినప్పటికీ విధాన పరమైన ప్రకటన అమలు చేయడం లేదు. ఎరువులు దొరక్క రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొన్న ఎరువులకు అదనపు ఎరువులు అంట గట్టి రైతుపై భారం వేస్తున్న వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. గతం వలె రైతు సేవా కేంద్రం (ఆర్ బి కే), వ్యవసాయ పరపతి సంఘం(పిఎసిఎస్) లలో రైతుకు కావలసిన అంత ఎరువు ఇవ్వకపోవడంతో గౌరవ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం లేదని చెప్పొచ్చు.

ఈనాటికి కూడా పంటల భీమా కిస్తీని ప్రభుత్వం ఆయా కంపెనీలకు చెల్లించకపోవడం వంటి చర్యలు రైతులలో ఆందోళనకు గురిచేస్తున్నదని, ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలో ఉన్న జంపర్ కోట,తోటపల్లి కాలువల ఆధునీకరణ కు కావలసిన నిధులు విడుదల చేసి పనులు చేయాలని డిమాండ్ చేశారు.జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కిమిడి రామ్మూర్తి (జిల్లా అధ్యక్షులు) కౌలు రైతుల సంఘం, గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి రాయ రామకృష్ణ, కిమిడి త్రిపురాంతకరావు, బలగ ఆనందరావు, బి.పారి నాయుడు రాగోలు గోవిందరావు, కిమిడి సూర్యరావు, సాసుబిల్లి సూర్యారావు ఎస్. పారి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బాడంగి గ్రంథాలయంలో చదవడం మాకష్టం

**బాడంగి, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**



విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ శ్రీ కార్యదర్శి ఆదేశాలు మేరకు చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా ఆది వారం బాడంగి గ్రంథాల యంలో గ్రంథాలయాలధికారి ఆర్. దుర్గా ప్రసాద్ పిల్లలలో నీతి కథలు చదివించడం అదేవిధంగా పిల్లలకి కంప్యూటర్ బేసిక్స్ నేర్పించడం జరిగింది. అదే విధంగా బాడంగి గ్రంథాలయంలో అన్ని పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి కావున నిరుద్యోగ యువత అందరూ వినియోగించుకోవాలి అని ఆయన అన్నారు

# గుమ్మిడీగడ్డ కాలువ నుంచి వచ్చే నీటిని విడుదల



**కురుపాం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**

కురుపాం మండలం సీతంపేట గ్రామం నుంచి వచ్చే గుమ్మిడీగడ్డ ప్రధాన కాలువ నుంచి వచ్చే నీటిని కురుపాం శాసనసభ్యురాలు శ్రీమతి తోయక జగదీశ్వరి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్ర దేవ్ దగ్గరుండి విడుదల చేశారు గత ఐదు సంవత్సరాలుగా ఈ నీరు రాకపోవడంతో ఇప్పుడున్న ప్రభుత్వం ఎమ్మెల్యే చొరవతో బట్టి పనులు చురుగ్గా జరగడంతో నీరు వస్తుందని పలు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగదీశ్వరితో పాటు వీరేష్ చంద్ర దేవ్ అలాగే మండల కన్వీనర్ కొండయ్య టిడిపి నాయకులు నీటిపారుదల శాఖ సిబ్బంది పలువురు గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# వర్షాలు కారణంగా నేడు కలెక్టర్ గ్రీవెన్స్ రద్దు

**పార్వతీపురం, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**

భారీ వర్ష సూచనల మేరకు సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ ) ను రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారులి ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్ష సూచన ఉందని, ఇతర ప్రాంతాల నుండి రావడంలో ప్రజలు ఇబ్బందులకు గురి అయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశం ఉందని, వాటిని దాటుకుని వచ్చే పరిస్థితులు ఉంటాయని, ప్రజలు ఇంటివద్దనే సురక్షితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అనవసర వ్యయప్రయాసలకు లోనై గ్రీవెన్స్ కు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేడు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు

## ఎంఈఓ ఉప్పాడ శాంతారావు



**నరసన్నపేట, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో నరసన్నపేట మండలంలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడమైనదని నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు తెలియజేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించి తప్పనిసరిగా సెలవు ఇవ్వవలసిందిగాఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆ ప్రకటనలో మండల విద్యాశాఖ అధికారి హెచ్చరించారు.

# మద్యం సీసాలు పట్టుకున్న చర్యలేవి..?

**పూసపాటిరేగ, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**

మండలంలోని మద్యం గొలుసు దుకాణాలు విచ్చలవిడిగా సాగుతున్న ఎక్సైజ్ శాఖ చూసి చూడనట్లు వ్యవహరిస్తుందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ మద్యం పాలసీ ప్రకారం లైసెన్స్ ఉన్న షాపుల ద్వారానే మద్యం సీసాలు విక్రయించాల్సి ఉంది. కానీ ఏ గ్రామంలో చూసినా మద్యం ఏరులై పారుతున్న ఎక్సైజ్ శాఖ నిద్రపోతుందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈనెల 27న పెదబత్తి వలసకు చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు ఏకుల సూరి నాయుడు చిన్నపాటి దుకాణం నడుపుతూ మద్యం సీసాలను అమ్ముతున్నాడు. ఈ విషయం తెలిసి ఎక్సైజ్ శాఖ సిబ్బంది దుకాణంతో పాటు ఇల్లు సొదాలు నిర్వహించగా నాలుగు మద్యం సీసాలు పట్టుబట్టడంతో వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు క్షేత్ర సహాయకుని సంబంధించిన ఆధార్ కార్డును కూడా తీసుకువెళ్లిపోయారు. కానీ క్షేత్ర సహాయకునుపై కేసు కట్టారా లేదా అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై స్థానిక సర్పంచ్ కొర్నాన వెంకటప్పడు ఎక్సైజ్ శాఖ ను ఆశ్రయించి పట్టుబడిన మద్యం సీసాల సంగతేంటంటూ అడిగినప్పటికి సరైన సమాధానం ఇవ్వడం లేదంటూ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ అధికారి సిబ్బంది చర్యలు తీసుకోకుంటే తమకున్న వీడియోల ఆధారంగా గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ కొర్నాన వెంకటాపూర్ తెలిపారు. ఇదే విషయమై సూర్య ప్రతినిధి ఎక్సైజ్ శాఖ సీఐ సురేష్ ను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

# నేటి నుంచి బిజెపి సభ్యత్వ నమోదు



**ఆమదాలవలస, సెప్టెంబర్ 1, మేజర్‌న్యూస్**

ఆమదాలవలస నియోజకవర్గంలో చేపట్టబోతున్న బిజెపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ పేడాడ సూరపు నాయుడు తెలిపారు. పట్టణంలో ఆదివారం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భారతదేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నటువంటి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంకు అందరూ మద్దత్తు తెలపాలని అన్నారు.

బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సభ్యత్వ నమోదు వలన కలిగే లాభాల గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ బిజెపి నాయకులు గురుగుబెల్లి వెంకట్రావు, పాతిన గడ్డయ్య, బొడ్డేపల్లి చిన్నబాబు, కిల్లి శ్రీరామ్మూర్తి, చింతాడ అప్పారావు, తిర్లంగి శ్రీరంగారావు, గొంటి రాము, అన్నెపు ధనుంజయ్ రావు తదితరులు పాల్గొన్నారు.